# ఆత్మీయతలు

"ఒరేయ్ అబ్బాయ్, అమ్మా నేను మీ అక్క వాళ్ళ ఊరెళతాంరా రేపు" అన్నాడు రామయ్య కొడుకుతో.

"ఏ పండగా లేదు. ఇప్పుడెందుకు? నానిగాడి బడికి సెలవులు ఇస్తారుగా. వాడ్నీ కూడా తీసుకెళ్ళచ్చు, ఆగండి" అన్నాడు శేఖర్.

"వెళ్ళాలనుకున్నాము. వెళతున్నాము" కొంచెం కటువుగా తండ్రి.

"సరే మీ ఇష్టం" అని శేఖర్ గదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

సునీత ఇంకా పడుకున్నట్లు లేదు. అనునయంగా చెక్కిలి నిమరబోయాడు భర్త శేఖర్. కోపంగా చేతిని తప్పించింది. కళ్ళు తుడుచుకుంటూ లేచెళ్ళి మంచం మీద కూర్చుంటూ "పొద్దున్న మీ నాన్నగారికి అంత కోపం ఎందుకు? నేనేం తప్పు మాట అన్నానని" అంది సునీత.

"ఏదో పెద్దవారు. కోపం వచ్చింది. నువ్వు కూడా మాటకు మాట సమాధానం చెప్పావుగా!" అన్నాడు.

"మరి చెప్పకపోతే ఎలాగ? నా పాట్లు ఎవరికి తెలుసు. ఐనా మీరెలా చెబితే అలా నడచుకుంటున్నా కదా, మన పెళ్ళి అయినప్పటినుండి"

"నువ్వుకూడా ఉద్యోగం చెయ్యి, వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా ఇద్దరి జీతాలతో ఫ్యామిలీని నడపవచ్చన్నారు. అలాగే చేస్తున్నా. ఒక పిల్లాడు చాలన్నారు. అలాగే కన్నాను. నా తల్లిదండ్రులకు నేను ఒక్కణ్ణే కొడుకుని. వాళ్ళు మనతోనే ఉంటారు, అన్నారు మీరు. సరే అన్నాను కదా? పొద్దున నేను పనిలో ఉండి కాస్త పాలు పోయించుకోండి మామయ్యా! అన్నానంతే. ఆయనకు ఎక్కడ లేని ప్రిస్టేజి పొడుచుకొచ్చి, కోపం వచ్చిందే" అంది సునీత బాధపడుతూ.

"అది కోపం కాదులేవే, పొద్దుపోయింది ఇక పడుకో" అన్నాడు శేఖర్, ఓదార్పు గొంతుతో.

"కోపం రాకపోతే రేపుమీ అక్కగారింటికి ఎందుకెళుతున్నట్లు?" అంది.

"ఒకచోటే ఉంటే తోచదు వాళ్ళకీ వయసులో. కాస్తంత మార్పుకోసం వెళ్ళడం వాళ్ళకి అలవాటేగా?"

"పోనీ వెళ్ళనివ్వండీ. ఇక వంటంటారా? కొంచెం పెందలాడే లేచి పనులు చేసుకుంటాను. మరి మీ అమ్మగారంత రుచిగా వండలేకపోవచ్చు" అంటూ మాటలు సాగదీస్తూ అంది సునీత ఉడుకుబోతుతనంతో.

అనుకున్నట్లే తర్వాతి రోజు రామయ్య, జానకమ్మ ఊరికి వెళ్లారు.


* * *

రోజులు గడుస్తున్నాయి. శేఖర్, సునీతకు కొన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

"తాత, నానమ్మ ఎప్పుడొస్తారు. వాళ్ళు నాకు కావాలి" అంటూ మారాం చేస్తున్నాడు ఐదేళ్ళ కొడుకు నాని.

సునీత ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చేది. అప్పుడు అత్తగారు కోడలుకి ఆప్యాయంగా అన్నం కొసరి కొసరి వడ్డిస్తూ పెట్టేది. వాళ్ళు ఊరెళ్ళినందున సునీతకి ఆ సౌఖ్యం ఇప్పుడు లేదు. ఇంట్లోనూ, బయట ఆఫీసులోనూ పనులతో సతమతమవుతుంది.

పైగా నానిగాడు అన్నం దగ్గర రోజూ ఏదొక పేచీ పెట్టి అన్నం సరిగ్గా తినడం లేదు. "తాత కావాలి. ఇది బాగా లేదు. అది నేను తినను. వద్దు తీసెయ్" అంటూ మారాం చేస్తూ పిల్లాడు సరిగా తిండి తినక, తాతపై దిగులుతో బాగా తగ్గిపోతున్నాడు.



సునీత పని హడావుడి ఉండి "తినకపోతే మానేయ్. మీ నానమ్మలా బ్రతిమాలి పెట్టే తీరిక, ఓపికా లేదు" అంటుండేది.

శేఖర్ సునీతకి సాయం చేయాలనుకొని, కూరలు తరుగుతూ చెయ్యి కోసుకున్నాడు.

సునీత ఇంట్లో పనితో, ఆఫీసు హడావుడిలతో క్షణం తీరిక లేకుండా అలసిపోతూ నీరసించిపోతుంది. ఇది గమనించాడు శేఖర్.

తండ్రి కూర్చునే కుర్చీ చిన్నబోయి ఖాళీగా ఉంది. వంటింటి వైపు చూశాడు. తల్లి పాడే అన్నమయ్య కీర్తనలు, పాత పాటలు వినిపించక, వెలితిగా వుంది మనసుకి. అప్పుడే శేఖర్‌కి మనుషుల విలువ వాళ్ళు లేనప్పుడే తెలుస్తుంది కాబోలు అనిపించింది. తన తల్లిదండ్రులు అందరిపై చూపించే ప్రేమానురాగాలు, ఆప్యాయతలు గుర్తుకొచ్చాయి ఆ క్షణంలో శేఖర్‌కి. అప్పుడే ఇక ఆలస్యం చేయకుండా ఓ నిర్ణయానికొచ్చాడు శేఖర్.

వెంటనే అమ్మా నాన్నని రమ్మని ఫోన్ చెయ్యమని చెప్పాడు భార్యతో శేఖర్.

సునీతకి ఆ మాటకి ఎంతో ఆనందమేసింది "అవునండీ నా తప్పు తెలుసుకున్నాను. పెద్దలు ఇంటికి పెట్టని కోటలు అని, ఆప్యాయతలు పంచే దేవుళ్ళని గ్రహించలేకపోయాను. మామయ్య పెద్ద ఆఫీసర్‌గా ఉద్యోగంలో రిటైరయ్యారు. వారికి నేను చిన్నపనులు చెబుతూ, ఆయన మనసు నొచ్చుకొనేట్లు చేశాను. పెద్దలు ఉన్న ఉమ్మడి కుటుంబంలో సామాజిక భద్రత, గౌరవ మర్యాదలుంటాయి. ఆప్యాయతలుంటాయి. బాధ్యతలు పంచుకొంటారు. ఇవన్నీ మనకు కావాలి. అందుకే ఇప్పుడే అత్తయ్య మామయ్యకు క్షమాపణలు చెప్పి మన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాను" అంటూ సునీత భర్తతో చెమ్మగిల్లిన కళ్ళతో ఉద్వేగానికి లోనై, తాను పోగొట్టుకున్న ఆప్యాయతలు గుర్తొచ్చి, గుండె గదుల్లో ఉన్న సున్నిత భావాలను భర్తకు పూస గుచ్చినట్లు చెప్పి పశ్చాత్తాపపడింది. వెంటనే సుదీర్ఘంగా ఫోనులో అత్త మామలతో మాట్లాడింది సునీత.

* * *

ఆ ఇంట్లో రామయ్య, జానకమ్మ రావడంతో ఆనంద బాష్పాలతో, కబుర్లతో కళకళ లాడుతూ ఓ పెద్ద పండుగ వాతావరణం నెలకొంది.

అత్తగారిని మామయ్యగారిని ఆప్యాయంగా సాదరంగా ఎదురువెళ్ళి వాళ్ళ లగేజీ అందుకొని ఆహ్వానించింది సునీత.

నానిగాడి ఆనందానికి, కేరింతలకి హద్దే లేకుండా పోయింది. తాత, నానమ్మను గాఢంగా హత్తుకొని, కేరింతలు కొడుతూ తాతయ్య చంకన ఒక్క ఉదుటన ఎక్కాడు. తాతయ్య, నాన్నమ్మ వచ్చారని సంతోషంగా పండుగలా ఉంది నానిగాడికి.

"ఏం నానమ్మ నువ్వు, తాత నన్నెందుకు వదిలి వెళ్ళారు. మీరు నాకు రోజూ గుర్తొచ్చి ఎన్నిసార్లు ఏడ్చానో తెలుసా? అన్నం కూడా తినబుద్ధి కాలేదు. ఎన్నిసార్లు రాత్రులలో మీరు గుర్తొచ్చి ఏడ్చానో? తాతా నేనంటే నీకెంతో ప్రేమకదా నన్ను ఇంక వదిలిపెట్టి వెళ్ళమని నామీద ఒట్టువేయండి" అంటూ నెత్తిన ఒట్టు పెట్టించుకున్నాడు నానిగాడు.

ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది ఆ వృద్ధ దంపతులకి వాడి మాటలకు.

"లేదురా నా చిట్టితండ్రి. నువ్వు, మీ నాన్న, అమ్మ గుర్తుకు వచ్చి మేమెంత కుమిలిపోయామో నీకెలా అర్థం అవుతుందిరా కన్నా. మిమ్మల్ని తలచుకోని క్షణం లేదురా. మిమ్మల్ని వదిలివెళ్ళి ఎంత మానసిక క్షోభ అనుభవించామో" అంటూ నానిగాడిని హత్తుకొని కన్నీళ్ళ పర్యంతమయ్యారు.

"అమ్మా మేం కూడా పెద్దోళ్ళమయ్యుండి ప్రేమను పంచాల్సిన ఈ వయసులో ఇలా ప్రవర్తించకూడదమ్మా" అంటూ కోడలు సునీతతో ప్రేమ నిండిన స్వరంతో చెప్పారు అత్తమామలు.

ఎప్పటిలాగే పాత పాటల కూనిరాగాలు తీస్తూ అమ్మ వంట చేస్తే ఎంతో ఆవురావురు మంటూ ఇంటిల్లిపాదీ భోజనం చేశారు.

మనవడిని బజారుకి తీసుకెళ్ళి చాక్లెట్లు, బొమ్మలు కొనిచ్చి ఆడిస్తున్నాడు తాత.

ఈ ప్రేమానురాగాలు, ఆత్మీయతలు, అనుబంధాలు కలగలిసి తల్లిదండ్రుల చుట్టూ పిల్లలు, పిల్లల చుట్టూ తల్లిదండ్రులు తరతరాలుగా తిరుగుతున్నాయి. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరిగినంత కాలం ఇలాగే ప్రేమానురాగాలు కాలచక్రంలో తిరుగుతాయి. ఇది అక్షర సత్యం.

-దేవప్రసాద్ మొగిలి (ఒంగోలు)